15052025-MAI-04_Layout 1 5/15/2025 3:56 AM Page 1



# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

## వెంటాడుతున్న వివాదం

**స్నేహాల** విషయంలో జాగ్రత్తగా ఉండాలని పెద్దలు అంటారు. దేశాల విషయంలో స్నేహాలు మరింత జాగ్రత్తగా, ఆచితూచి చేయాల్సి ఉంటుంది. నేతల మధ్య స్నేహాలు ముఖ్యమైనవే. కానీ, జాతీయ ప్రయోజనాలే అంతిమమైనవిగా నిలుస్తాయనడంలో సందేహం లేదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన దోస్త్ అని ప్రధాని మోదీ తరచుగా చెప్తుంటారు. ఇప్పుడు ఇండో-పాక్ యుద్ధం నేపథ్యంలో తన దోస్త్ చేసిన పని వల్ల ప్రధాని మోదీ తీవ్ర ఇరకాటంలో పడ్డారు. ట్రంప్ గతంలో రష్యా-ఉక్రెయిన్ మధ్య సంధి కుదిర్చేందుకు వైట్‌హౌస్‌లో జరిపిన ప్రయత్నాలు హాస్యాస్పదంగా ముగిసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఇండియా వంతు వచ్చినట్టు కనిపిస్తున్నది. మధ్యవర్తిత్వ రభస కేంద్ర ప్రభుత్వం మెడకు చుట్టుకున్నట్టే కనిపిస్తున్నది. మంగళవారం విదేశాంగ శాఖ ప్రతినిధి పత్రికా సమావేశంలో ఈ అంశమే ప్రధానంగా ప్రస్తావనకు రావడం గమనార్హం.

భారత్-పాక్ యుద్ధ విరమణకు చాలా చాలా చేసినట్టు అగ్రరాజ్యం అధ్యక్షుడు ట్రంప్ చెప్పుకొంటున్నారు. వాణిజ్యాన్ని రాజకీయ అవసరాలకు వాడుకోవడంలో తనను మించినవాడు లేడని ఆయన అంటున్నారు. నిన్నటిదాకా టారిఫ్‌లనే అస్త్రాలుగా వాడుకున్న ఈయన ఇండియా, పాకిస్థాన్‌లను యుద్ధం ఆపకపోతే మొత్తంగా వాణిజ్యమే ఆపేస్తానని బెదిరించారట. దాంతో ఇరుపక్షాలూ దారికి వచ్చాయట. ఇంకా ఆశ్చర్యకరమైన అంశమేమంటే భారత్-పాకిస్థాన్ దేశాల అణుయుద్ధం నివారించానని ఆయన చెప్పుకోవడం. ఒక మహా విధ్వంసాన్ని నివారించినందుకు తనకెంతో ఊరటగా ఉందని ట్రంప్ అంటున్నారు. ఇవన్నీ రకరకాల వేదికలపై ఆయన వెల్లడిస్తున్న విషయాలు. ఆయన ఒక్కో సంగతి వెల్లడిస్తున్నకొద్దీ పాకిస్థాన్ సంగతేమో గానీ, ఇండియాకు మాత్రం ఇరకాటం అంతకంతకూ పెరిగిపోతున్నది. అమెరికాకు ఈ ప్రకటనలపై అధికారికంగా నిరసన తెలిపారా? అనే ప్రశ్న ఎదురైనప్పుడు విదేశాంగ శాఖ ప్రతినిధి సూటిగా సమాధానం చెప్పకుండా దాటవేయడం ఇందుకు నిదర్శనం.

అగ్రరాజ్యమైన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యవహారంలో గాని, వ్యక్తీకరణలో గాని సంప్రదాయ రాజకీయాలకు భిన్నమైన నాయకుడు. తాజాగా ఇండియా-పాకిస్థాన్ రణ విరమణ విషయంలోనూ ఇది స్పష్టంగా వ్యక్తమవుతున్నది. అయితే, పాకిస్థాన్ మాత్రం అమెరికా మధ్యవర్తిత్వం గురించి బాహాటంగానే ఒప్పుకున్నదనేది వేరే విషయం. రెండు దేశాల సైనికాధికారుల చర్చల ద్వారా కాల్పుల విరమణ జరిగినట్టు, ఇండియా జరిపిన విధ్వంసాన్ని చూసి పాకిస్థాన్ కాళ్లబేరానికి వచ్చినట్టు మన విదేశాంగ శాఖ ప్రతినిధి చెప్తున్నారు. అమెరికా లేదా ట్రంప్ మధ్యవర్తిత్వం వహించిన మాట నిజమేనని అధికారికంగా ఒప్పుకోవడం భారత్‌కు సాధ్యపడదనే విషయం విదేశాంగ శాఖ ప్రతినిధి ప్రకటన ద్వారా తేలిపోయింది. అదే సమయంలో అమెరికా అధినేత ట్రంప్ చేసిన ప్రకటనలపై నిరసన తెలపడమూ ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి సాధ్యపడకపోవచ్చు. ఈ నేపథ్యంలో మరికొన్నాళ్లపాటు రణ విరమణ వివాదం కేంద్ర ప్రభుత్వాన్ని వెంటాడుతూనే ఉంటుంది. అనూహ్యమైన రీతిలో అమల్లోకి తెచ్చిన రణ విరమణ గురించి దేశ ప్రజలను విశ్వాసంలోకి తీసుకోకపోవడమే అందుకు ముఖ్య కారణం.

---

# అనేక బంధనాలలో మోదీ



టంకశాల అశోక్

**పాకిస్థాన్‌తో సాయుధ ఘర్షణలో భారత సైన్యానిది స్పష్టంగా పైచేయి అయిన దశలో కాల్పుల విరమణకు ప్రధానమంత్రి మోదీ ఎందుకు అంగీకరించారన్నది ఇప్పుడు అందరూ వేస్తున్న ప్రశ్న. విశేషం ఏమంటే అందుకు గల కారణాలనైనా ఎవరూ ఊహించలేకపోతున్నారు. కారణం ఫలానా అని ఏదైనా సూచన వచ్చినా ఆమోదించటం లేదు. తన జోక్యం వల్లనే విరమణ జరిగిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా ఒకటికి రెండుసార్లు ప్రకటించినా ఒప్పుకొనేందుకు మనస్కరించటం లేదు. ఇదంతా దేశంలో ప్రస్తుతం నెలకొన్న వాతావరణానికి అద్దం పడుతున్నది. మోదీ అంగీకారానికి తగు కారణాలున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, ఆయన అమెరికాతో వాణిజ్యం ఒక్కటే కాదు, ఇంకా అనేక బంధనాలలో చిక్కుకొని ఉన్నారు గనుకనే ట్రంప్‌ను కాదనలేకపోయారు.**



అమెరికా అధ్యక్షుడు రెండవసారి చెప్పిన మాటలను ఒకసారి గమనించండి. కాల్పుల విరమణ అంగీకరానికి 'ఇంకా చాలా కారణాలు ఉండొచ్చు. కానీ వాటిలో వాణిజ్యం చాలా ముఖ్యమైనది' అన్నారాయన. ఇందులో 'ఇంకా చాలా కారణాలు' అన్న మాట ప్రత్యేకంగా గమనించదగినది. అవి ఏమిటో ఆయనకు తెలియదనుకోలేం. కానీ, బహిరంగంగా చెప్పలేరు. అవేమిటో అర్థం చేసుకొనేందుకు మనమే ప్రయత్నిద్దాం. మోదీకి అనేక బంధనాలు అంటున్నది దీనిగురించే. ఆ విషయం కొద్దిసేపు అట్లుంచితే, స్వయంగా పెద్ద వ్యాపారి అయిన ట్రంప్ అంతర్గత విధానాలు, విదేశాంగ విధానాలు అన్నీ కూడా సూర్యుని చుట్టూ గ్రహాల వలె వాణిజ్యం చుట్టూ తిరుగుతుండటం చూస్తున్నాం. అందుకు ఉదాహరణలు అనేకం ఉన్నాయి. అవి కనిపిస్తున్నవే. అదే ప్రకారం భారత్-పాక్ ఘర్షణలోనూ ఆ ప్రస్తావన తేవటంలో ఆశ్చర్యం లేదు. వాణిజ్యం కార్డును ప్రయోగించి చాలా చేస్తున్నానని ఈ సందర్భంలోనూ ఆయన అన్నారు.

> భారత్-పాక్ ఘర్షణ విషయానికి వస్తే, రెండు దేశాలనూ ఒకే విధంగా ఒత్తిడి చేసి ఒప్పించగల కార్డు వాణిజ్యమని ఆయన భావించారు. ప్రస్తుతం భారత, పాకిస్థాన్‌లు రెండూ ట్రంప్ టారిఫ్‌ల ఒత్తిడిలో ఉండి, రాజీల కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తుండటం తక్షణ సమస్యగా మారి ఆయనకు కలిసివచ్చింది.

విరమణకు, వాణిజ్యానికి సంబంధం లేదని భారత ప్రభుత్వం నిరాకరించబూనింది గాని, మరి అసలు కారణమేమిటో చెప్పలేని స్థితిలో ఈ నిరాకరణకు విలువుండదు. పైగా అమెరికా అధ్యక్షుడంతటి వాడు బహిరంగంగా అన్నప్పుడు. మేము మీతో చాలా వాణిజ్యం చేయాలనుకుంటున్నాము, కాల్పులు విరమించని పక్షంలో వాణిజ్యం ఎంతమాత్రం ఉండబోదని కూడా హెచ్చరించినప్పుడు.

ఘర్షణ ఈ దశలో ఆగనట్టయితే అణుయుద్ధానికి దారితీసే ప్రమాదం ఏర్పడిందనే సమాచారం తమకు నిఘా వర్గాల నుంచి వచ్చిందనే మరొక మాట కూడా ట్రంప్ ఈ రెండవ సారి ప్రకటనలో అనటం గమనించదగినది. మొదటిసారి ప్రకటన సమయానికే ఆయనకు ఆ సమాచారం ఉంది. అందుకే, 'మిలియన్ల కొద్దీ అమాయకుల ప్రాణాలు కోల్పోయే ప్రమాదం' అన్నారు. అణ్వాస్త్రాలనే మాటను ఉపయోగించకపోయినా, తన ఉద్దేశం అదేనని భావించవచ్చు. మామూలు యుద్ధంలో లక్షలాది మంది చనిపోరు కదా. అణు యుద్ధ ప్రమాదం నిజంగా ముంచుకొచ్చిందీ లేనిదీ తెలియదు గాని, 'యుద్ధంతో మాకు సంబంధం లేదు, అది వారిద్దరి సమస్య' అంటూ వచ్చిన ట్రంప్ బృందం, అకస్మాత్తుగా రెండు పక్షాలతో రాత్రింబవళ్లు ఫోన్ సంభాషణలు సాగించి కాల్పుల విరమణకు ఒత్తిడి చేసి మరీ ఒప్పించటానికి వేరే కారణం కనిపించదు.

ఇంతకూ జరిగిందేమిటి? ఈ నెల 6-7 తేదీల మధ్యరాత్రి పాకిస్థాన్‌పై ఇండియా దాడులు మొదలు కాగా, 7న మధ్యాహ్నం భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, తమ చర్య 'నాన్ ఎస్కలేటరీ' అని ప్రకటించారు. అనగా, లోగడ సర్జికల్ స్ట్రయిక్స్, బాలాకోట్ దాడుల తరహాలోనే ఈసారి కూడా ఉగ్రవాదులపై దాడికే పరిమితమవుతామని, పాకిస్థాన్ సైన్యంపైనో ఇతరత్రా నో దాడులకు విస్తరించబోమన్నది అర్థం. కానీ పాకిస్థాన్ వైపు నుంచి అట్లా జరుగలేదు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌కు బయట పంజాబ్‌లో గల బహావల్‌పూర్, మురిద్కేలపై కూడా దాడులు, మసీదులపై దాడులు, పౌరుల మరణం అనే కారణాలు చూపుతూ వారు అదే రాత్రి దాడులకు దిగారు. దానితో 'నాన్ ఎస్కలేటరీ' అన్నది కాస్తా 'ఎస్కలేటరీ' కావటం మొదలైంది. డ్రోన్లు, క్షిపణులు సరిహద్దులను దాటగా, యుద్ధ విమానాలు సరిహద్దులు దాటకుండా సొంత భూభాగాల నుంచే రంగంలోకి వచ్చాయి. ఒకరి సైనిక స్థావరాలపై ఒకరు దాడులు మొదలుపెట్టారు. సరిహద్దుల వద్ద కాల్పులు సాగాయి. రెండు దేశాలూ సరిహద్దులలోకి సైన్యాలను కదిలించటం, యుద్ధ నౌకల మోహరింపులు చేయటం కనిపించింది.

ఈ సమాచారాలన్నీ అమెరికాకు చేరుతుండగా సరిగా ఆ దశలో ఒక ప్రమాదకర పరిణామం చోటుచేసుకున్నది. పాకిస్థాన్ అధ్యక్షుడు షెహబాజ్ షరీఫ్ 10వ తేదీ ఉదయం నేషనల్ కమాండ్ అథారిటీ (ఎన్‌సీఏ) సమావేశాన్ని పిలువనంపారు. ఆ సంస్థ అణ్వస్త్ర వ్యవహారాలను పర్యవేక్షిస్తుంది. దానిని సమావేశపరచవలసిన అవసరం ఏమి వచ్చిందో తెలియదు గాని, ఆ సమాచారం తెలిసిన ట్రంప్ బృందం మాత్రం తీవ్ర ఆందోళనతో వెంటనే జోక్యం చేసుకొని ఆ సమావేశాన్ని రద్దు చేయించింది. యుద్ధంతో మాకు సంబంధం లేదంటూ వచ్చిన ఆ బృందం రెండు దేశాలకు వరుసగా ఫోన్లు చేసి చివరికి కాల్పుల విరమణను ప్రకటింపజేశారు.

భవిష్యత్తు గురించిన తక్కిన చర్చలోకి వెళ్లేముందు, మొదట అనుకున్నట్టు, 'అనేక బంధాలలో మోదీ' అనే మాటకు అర్థమేమిటో చూద్దాం. సైనికంగా పై చేయి లభిస్తున్న స్థితిలో కాల్పుల విరమణకు ప్రధాని మోదీ అంగీకరించటానికి కారణాలు అమెరికా అధ్యక్షుడు పేర్కొన్న వాణిజ్యం, అణు యుద్ధ ప్రమాదమేనా ఇంకేమైనా ఉండవచ్చునా? వాణిజ్యం హెచ్చరిక దేశ ప్రయోజనాలకు మించినదా? అణ్వస్త్రాలు ఇండియా వద్ద కూడా ఉన్నప్పుడు, తాము సైతం సర్వనాశనం కాగల అటువంటి దుస్సాహసానికి పాకిస్థాన్ నిజంగా పాల్పడి ఉండేదా? నిజానికి సాయుధ ఘర్షణ పూర్తిస్థాయి యుద్ధానికైనా చేరలేదు ఇంకా. రెండు దేశాల త్రివిధ బలాలు సర్వ సన్నద్ధతలో ఉన్నాయి గాని, ఎస్కలేషన్ స్థాయి ఇంకా డ్రోన్లు, క్షిపణుల స్థాయికే పరిమితమై ఉన్నది. పూర్తిస్థాయి యుద్ధానికి ఎస్కలేట్ అయి అందులో పాకిస్థాన్ ఓటమి పరిస్థితి వచ్చినప్పుడు అణు యుద్ధ స్థాయికి ఎస్కలేట్ కావచ్చు. పైగా, అన్ని అణ్వస్త్ర దేశాల వలెనే పాకిస్థాన్‌కు కూడా 'అణ్వస్త్ర ప్రయోగ విధానం' (న్యూక్లియర్ డాక్ట్రిన్) అనేది ఒకటుంది. అందులోని నాలుగు అంశాల ప్రకారం చూసినట్టయితే, అణ్వస్త్రాలు ప్రయోగించే పరిస్థితి అంటూ ఏదీ వారి దృక్కోణం నుంచి కూడా కనిపించదు. అయినప్పటికీ ప్రయోగిస్తే ప్రయోగించవచ్చు గాక. కానీ, ఆ పరిస్థితి లేదని, అమెరికాను కాదని ఆ పని చేయగల సాహసమూ లేదని మాత్రం చెప్పవచ్చు.

మోదీ ప్రభుత్వపు వ్యూహకర్తలు గ్రహించలేనివి కాదు ఇవన్నీ. అయినప్పటికీ ట్రంప్ ప్రభుత్వపు సూచనకు లేదా ఒత్తిడికి వెంటనే ఎందుకు అంగీకరించినట్టు? కశ్మీర్ విషయంలో బయటి జోక్యాన్ని అంగీకరించబోమన్న చిరకాలపు విధానానికి, ఆ మేరకు పాకిస్థాన్‌తో 1972లో జరిగిన షిమ్లా ఒప్పందానికి విరుద్ధమైన రీతిలో? అమెరికా జోక్యం చేసుకునే ప్రయత్నాలను ఇందిరా గాంధీ స్పష్టంగా, నిర్భయంగా ధిక్కరించిన దానికి విరుద్ధంగా? భారతదేశ చరిత్రలోనే తమంతటి జాతీయవాద ప్రభుత్వం లేదని అనునిత్యం చాటుకుంటున్నప్పుడు? పహల్గాం మారణకాండ నుంచి 6-7 తేదీల రాత్రి దాడి వరకు మధ్యకాలంలో చేసిన పలు భీషణ ప్రతిజ్ఞలు, ప్రకటించిన లక్ష్యాలలో ఇంకా ఏవీ నెరవేరనపుడు?

> అన్నింటికీ భిన్నమైన రీతిలో అకస్మాత్తుగా ట్రంప్ జోక్యానికి ఎందుకు తల ఊపవలసి వచ్చిందన్నది ప్రశ్న. ఆ సమయంలో అటునుంచి వచ్చిన సూచన ఏమిటి? అందుకు ప్రతిగా మోదీ ప్రభుత్వం ఏమైనా వాదనలు చేసిందా, చేస్తే ఏమిటి? చివరికి ఎందువల్ల అంగీకరించారన్నవి దేశ ప్రజలకు తెలియవలసిన విషయాలు.

ఇందిరాగాంధీ వలె గాక నరేంద్ర మోదీ ఈ విధంగా అంగీకరించటానికి కొన్ని బలమైన కారణాలున్నట్టుగా భావించవలసి ఉన్నది. ఆమె వలె గాక తను అమెరికాతో అనేక బంధనాలలో చిక్కుకుపోయి ఉన్నారు. అప్పటి నుంచి ఆరు దశాబ్దాల కాలంలో పరిస్థితులు కూడా చాలా మారాయి. ఇవన్నీ గమనిస్తే తప్ప, మోదీ లొంగుబాటుకు గల కారణాలు మనకు అర్థం కావు. అవేమిటో చూద్దాం. ఇందిరాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి స్వాతంత్ర్యోద్యమ కాలాన్ని చూసినవారు. అప్పటి స్ఫూర్తి, ఆత్మగౌరవం, దేశాభిమానం, స్వతంత్ర ధోరణులు, దేశ ప్రయోజనాల పట్ల పూర్తి నిబద్ధత గలవారు. ఆ కారణాల వల్ల బయటి జోక్యాలను సహించనివారు. ఆ తరాలకు చెందిన జనసంఘ్, బీజేపీ నాయకుల సంస్కృతి, రాజనీతి కూడా అటువంటిదే. దేశ ప్రయోజనాల కోసం అమెరికా, రష్యా, బ్రిటన్ వంటి బయటి దేశాల సహకారం అవసరమైతే ఆ మేరకు పరస్పర సహకారాలున్నాయి గానీ, వారి నిర్దేశాలను అంగీకరించలేదు.

> మోదీ సమయం వచ్చేసరికి ఈ మౌలికతలు మారే పరిస్థితులు వచ్చాయి. ఆయన విదేశాంగ విధానం స్వతంత్రతను పూర్తిగా వదిలివేసిందని అనటం లేదు. కానీ, అందుకు భంగం కలిగే పరిస్థితులు కొన్నింటిని తనకు తానే సృష్టించుకోవటం మొదలుపెట్టింది.

ఆ పరిస్థితులు ఏర్పడిన కొద్దీ కొనసాగిన కొద్దీ అమెరికాతో సాన్నిహిత్యం పెరగటం, ఆ సాలెగూడులో చిక్కటం, స్వతంత్రతను ఆ మేరకు కోల్పోతుండటం, అయినప్పటికీ అంతా మన ప్రయోజనాల కోసమేననుకోవటం జరుగుతూ వస్తున్నది. ఈ విధమైన బంధనాలు నరేంద్ర మోదీ మొదటిసారి అధికారానికి వచ్చినప్పటి నుంచే (2014) మొదలయ్యాయి. ముఖ్యంగా ఒబామా తర్వాత ట్రంప్, బైడెన్, తిరిగి ట్రంప్ కాలాలలో. 'అబ్ కీ బార్ ట్రంప్ సర్కార్' ఆలింగనాలు ఫలించి మధ్యలో బైడెన్ వల్ల కొంత రసభంగం కలగకుండా ఉన్నట్టయితే ఎట్లుండేదో గాని, అయినప్పటికీ బైడెన్‌తో మౌలికంగా మిత్రభేదం ఏమీ కలగలేదు.

విషయం ఏమంటే, ట్రంప్ వలెనే మోదీకి కూడా గుజరాత్ ముఖ్యమంత్రిత్వ కాలం నుంచే 'ధనమేరా అన్నిటికీ మూలం అయ్యింది'. అనగా వ్యాపారాలు, తన వ్యాపార మిత్రులూ అని. ప్రధాని కావటంతో అది జాతీయస్థాయికి విస్తరించింది. గతం నుంచే గల ఆర్థిక సంస్కరణలు అందుకు ఉపకరించాయి. ఈ లక్ష్యాలకు అమెరికాతో, యూరప్‌తో సాన్నిహిత్యం ఎప్పటికప్పుడు పెరగటం అవసరమైంది. రష్యాతో ఆయుధాలు, చమురు వంటి వనరులు, వాణిజ్యం సజావుగానే ఉన్నా, ఆర్థిక రంగం, సాంకేతిక సహకారాలలో, భౌగోళిక వ్యూహాలు, పైచేయి సాధనలలో 'అంతులేని' అవకాశాల కోసం అమెరికాతో బంధాల పెరుగుదల తప్పనిసరి అయింది. చైనాకు సంబంధించి వాణిజ్యం బాగానే జరుగుతున్నా, సరిహద్దు సమస్య వల్ల, ఇతరత్రా భౌగోళిక రాజకీయ వ్యూహాలను బట్టి వారు అప్రకటిత ప్రత్యర్థులయ్యారు. ఆ విధంగా మిగిలింది అమెరికా.

అమెరికాకు పాకిస్థాన్‌తో ఒకప్పుడు ఉండిన వ్యూహాత్మక సంబంధం ప్రధానంగా ఇరాక్, అఫ్ఘానిస్థాన్ దశల తర్వాత బాగా తగ్గిపోయింది. అమెరికా ప్రత్యర్థి అయిన చైనాకు పాకిస్థాన్ చేరువైంది. కనుక అమెరికాకు భారత్‌పై ప్రేమ పెరిగింది. అంతమాత్రాన ఒక అగ్రరాజ్యం పాకిస్థాన్ వంటి ఒక భాగస్వామిని పూర్తిగా ఎప్పుడూ వదులుకోదు. అవసరమైనప్పుడల్లా ఉపయోగించుకుంటుంది. అదే సమయంలో ఇండియా పట్ల మొగ్గు పెరుగుతుంది. ఆ లెక్కలలో ఇండియాకు, అనగా మోదీకి, అమెరికా పట్ల మరింత మొగ్గు కలుగుతుంది. అది మరొక బంధం అవుతుంది.

ఉత్తరం వైపు గమనిస్తే చైనాతో మనకు గల సమస్యలు ఒకటి కాగా, వారితో అమెరికాకు గల సమస్య మరొకటి. ఈ రెండింటికి కలిపి ఆ ప్రభావాలతో ఇంకా వేర్వేరు కోణాలు ఏర్పడుతాయి. భారత్-చైనా సరిహద్దు వివాదంలో అమెరికా జోక్యాన్ని అంగీకరించబోమని చెప్తూనే, సరిహద్దు ప్రాంతాలకు వారి ప్రతినిధుల పర్యటనను, ప్రకటనలను ఆమోదిస్తాం. పసిఫిక్‌లో, దక్షిణ చైనా సముద్రంలో 'క్వాడ్' కూటమి రూపంలో, ఇతరత్రా సన్నిహితంగా వ్యవహరిస్తాం. గాజాలో ఇజ్రాయెల్ మారణకాండ పట్ల అంటీముట్టనట్టు ఉంటాము. ఇవన్నీ దేశ ప్రయోజనాలకు అవసరం కాదా అంటే కాదనలేం. అదే సమయంలో, ప్రస్తుత చర్చకు సంబంధించి గమనించవలసిందేమంటే, మొత్తం మీద, అంతిమ విశ్లేషణలో, అమెరికాతో మోదీ ప్రభుత్వ సాన్నిహిత్యం పెరుగుతూ, బంధాలు విస్తరిస్తూ, వాటిలో చిక్కుకుపోతుండటమనేది కనిపిస్తున్నది. ఇండియా పట్ల అమెరికా దృష్టి కూడా అదే విధంగా ఉన్నది. అటువంటి బంధనాలలో చిక్కుకున్నప్పుడు, సాధారణ విషయాలైతే వేరుగాని, పాకిస్థాన్ వంటి పొరుగు దేశంతో ఘర్షణ, అణుయుద్ధ అనుమానాల వంటి పరిస్థితిలో, ఇందిరాగాంధీ వంటివారు గాక నరేంద్ర మోదీ వంటివారు, ఆ బంధనాలను కాదని స్వతంత్రంగా వ్యవహరించటం తేలిక కాదు. శాస్త్రి, ఇందిరలకు దేశ ప్రయోజనాలు ఉన్నా ఇటువంటి బంధనాలలోకి ప్రవేశించలేదన్నది గమనించవలసిన విషయం.

> స్వతంత్రంగా వ్యవహరించగల పునాదులు, నేపథ్యం, స్వభావం, దేశ ప్రయోజనాల దార్శనికత, అవన్నీ కలిగించే ధైర్య సాహసాలూ లాల్‌బహదూర్, ఇందిరలకు ఉన్నట్టు మోదీకి లేవు. ఆయన పునాదులు, నేపథ్యం, ప్రయోజనాలు, లక్ష్యాలు ఏమిటో పైన చెప్పుకొన్నాం. అందువల్ల, తార్కికంగా చూసినప్పుడు, ట్రంప్‌ను కాదన గల ధైర్యం తనకు ఉండదు.

పాకిస్థాన్‌తో భవిష్యత్తు సంబంధాలు ఏమిటన్నది ప్రశ్న. సరిహద్దులలో సైన్యాల తగ్గింపు, కాల్పులు జరుపుకోకపోవటం అనే అంగీకారాలు సైన్యాధికారుల మధ్య 12వ తేదీన జరిగాయి. అది ఎంతకాలం నిలుస్తుందన్నది వేరే ప్రశ్న. పాకిస్థాన్‌తో చర్యలు టెర్రరిజం గురించి, పీఓకే గురించి మాత్రమేనని ప్రధాని ప్రకటించారు. సింధూలో నీరు వదిలేది లేదన్నారు. మధ్యవర్తిత్వం వహిస్తానని ట్రంప్ సూచించగా అందుకు అంగీకరించబోమన్నారు. అనగా సమీప భవిష్యత్తులో చర్చలన్నవి ఉండబోవన్న మాట. ఇక, బాలాకోట్‌లో అంతం చేశామనుకున్న టెర్రరిజం తిరిగి మొలకలు వేసినట్టు, ప్రస్తుత దాడులు, ధ్వంసం తర్వాత తిరిగి మొలకలు వేయబోదన్న హామీ లేదు. ఆ పని కశ్మీర్‌లో అంతర్గతంగా జరుగుతుంది. అది 13వ తేదీకే కనిపించింది కూడా. అట్లాగే పాకిస్థాన్‌లో కొత్త శిబిరాలు వెలుస్తాయి. కొందరు ఉద్వేగంతో అవాస్తవిక వైఖరి తీసుకుంటూ పీఓకే ఆక్రమణ, బలూచిస్థాన్‌తో పాటు ఖైబర్ ఫఖ్తూన్ ఖ్వాలను విడగొట్టమంటున్నారు. ఇవేవీ సాధ్యమయ్యేవి కావు. రాజకీయ పరిష్కారం ఒక్కటే మార్గం. అది ఏది కావచ్చునన్నది వేరే చర్చ.

---





## వ్యాపారం చేద్దామని చెప్పి ఒప్పించా!



లక్షల మంది అమాయక ప్రజలు చనిపోకుండా భారత్-పాక్ యుద్ధాన్ని నేనే ఆపాను. సహచరులారా రండి.. డీల్ చేసుకుందాం.. వ్యాపారం చేద్దామని చెప్పి ఇరు దేశాలను శాంతి చర్చలకు ఒప్పించా. ప్రస్తుతానికి అంతా బాగానే ఉన్నది. పరిస్థితులు ఇంకా మెరుగవ్వాలంటే వారు కలిసి డిన్నర్ (భోజనం) చేయాలి.

- డొనాల్డ్ ట్రంప్, అమెరికా అధ్యక్షుడు


---

**ఆపరేషన్ సిందూర్ తొలి అంకం ముగిసింది. పాకిస్థాన్‌ను భారతసైన్యం కోలుకోలేని విధంగా దెబ్బతీసి, ప్రపంచానికి తన శక్తి ఏమిటో చాటిచెప్పింది. పహల్గాం పరిణామాలు ఇంత దారుణంగా ఉంటాయని పాక్ రాజకీయ ప్రభుత్వం ఊహించలేకపోయింది. తినడానికి తిండే లేని ఆ దేశం యుద్ధానికి తయారుగా లేదు. అయితే, అక్కడ ప్రభుత్వం నామమాత్రమే. అంతా సైన్యం, ఐఎస్‌ఐ చేతుల్లోనే ఉంటుంది. దానికి నిదర్శనం కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన తర్వాత అదే రాత్రి మళ్లీ భారత్‌పై డ్రోన్ దాడులు జరగడం. పాక్ సైన్యాధ్యక్షుడు ఆసిఫ్ మునీర్‌కు విరమణ ఒప్పందం రుచించలేదనడానికి ఆ దాడులే రుజువు.**

# పీవోకే లేని సిందూరం అసంపూర్ణం



చెర్మాల శ్రీనివాస్



ఆపరేషన్ సిందూర్ సాధించిన విజయమంతా భారత సాయుధ దళాలకే చెందుతుంది. వారు వీర విక్రమ పరాక్రమాలతో పాకిస్థాన్‌కు ముచ్చెమటలు పట్టించారు. ఈ దశలో భారత ప్రభుత్వం సంపూర్ణ విజయానికి ఓ అడుగు దూరంలో వెనకడుగు వేయడం సమస్త భారతావనిని నివ్వెరపరిచింది. అంతర్జాతీయ 'ఒత్తిళ్ల'తో తనకు కావాల్సిందేమిటో స్పష్టం చేయకుండానే వెనుదిరిగింది.

ఆశ్చర్యకర విషయమేమిటంటే, కాల్పుల విరమణను అమెరికా అధ్యక్షుడు ప్రకటించడం. కారణమేదైనా, ఇది పరాయి దేశపు అనవసర జోక్యం. ఉగ్రదేశానికి ఐఎంఎఫ్ సాయం అందకుండా చేయగలిగేంత అధికారం ఉన్నా ఆ పనిచేయని అమెరికా.. భారత్‌ను మాత్రం కాల్పుల విరమణకు ఒప్పించగలిగింది. అమెరికాకు అధ్యక్షుడు ఎవరైనా, వారి లాభమే వారికి ముఖ్యం. అణుబాంబులు వాడకుండా తాను ఉపఖండాన్ని కాపాడానని అమెరికా 'వ్యాపారవేత్త' డొనాల్డ్ ట్రంప్‌కు పిచ్చిమాటలు మాట్లాడే అవకాశం భారతే ఇచ్చింది. ఇక మరో తప్పిదం. పాకిస్థాన్ మనకు భయపడి లొంగిపోయిందని ముందుగా ఒప్పందాన్ని ప్రకటించాం. పాకిస్థాన్ ఎక్కడా వెనక్కి తగ్గినట్టు మాట్లాడలేదు. పాక్ ప్రధాని మాత్రం విజయం తమదేనని, భారత్‌కు తీవ్ర నష్టం కలుగజేశామని తమ పార్లమెంట్‌లో ప్రకటించుకున్నాడు. ఇక్కడ ఎవరి చేయి పైన? ఎవరి చేయి కింద? అని కాదు.

> ఒక్కటి మాత్రం నిజం. నిశ్చయంగా భారత ప్రభుత్వ ఈ నిర్ణయం ప్రజలకు నచ్చలేదనేది నిర్వివాదాంశం. ఇక మీదట 'ఒక్క గుండు హద్దు దాటినా, అది యుద్ధంగా పరిగణిస్తామ'ని ప్రకటించి ఎంతగా సముదాయింపజూసినా, లక్ష్యం నెరవేరనప్పుడు ఎవరూ సంతృప్తి చెందరు. భారత అమాయకపు ఆడబిడ్డల సిందూరాన్ని తుడిచేసిన ఉగ్రవాదులను పెంచిపోషిస్తూ, చనిపోయిన ఉగ్రవాదులకు పాక్ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు చేస్తున్న వైనాలు చూసిన భారత ప్రజలు కేంద్ర ప్రభుత్వ ఉత్తుత్తి బెదిరింపు మాటలతో సంతృప్తి చెందరు.

పాకిస్థాన్ పీచమణిచే వేదికను, దశాబ్దాలుగా రగులుతున్న రావణకాష్ఠాన్నీ ఆర్పే సువర్ణావకాశాన్ని చేజార్చుకున్న భారత్, కాల్పుల విరమణకు ఒప్పుకొని షరతులు విధించే అవకాశాన్నీ కోల్పోయింది. ప్రస్తుతానికి కొంతకాలం అంతా స్తబ్ధుగా ఉంటుంది. ఈలోపు ఐఎంఎఫ్ ఇచ్చిన డబ్బులతో భారత్ కూలగొట్టిన భవంతులను, ఫ్యాక్టరీలను పునర్నిర్మించుకొని మళ్లీ ఒక పుల్వామానో, ఉరినో, పహల్గాంనో అమలు చేస్తారు. తీవ్రవాదులంతా తిరిగి ఏకం కావడానికి ఈ దౌత్యపరమైన స్తంభన వారికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

అయితే ఒక్కటి మాత్రం నిజం. మనకు తెలిసినంతవరకూ, తెలియని విషయాలు తెలువకపోయినా పాకిస్థాన్‌కు మాత్రం తీవ్ర నష్టమైతే వాటిల్లింది. కొన్ని విషయాలు బయటికి తెలియకపోవచ్చు కానీ, పాకిస్థాన్ అణుస్థావరం కూడా పాక్షికంగా దెబ్బతిన్నదని, అందులో నుంచి రేడియేషన్ లీకవుతున్నదన్న వార్తలు కూడా అంతర్జాతీయ మీడియాలో వస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో పాక్‌కు అణుబాంబు బయటికి తీయడం తప్ప వేరే మార్గం లేదనే నిఘా సమాచారం దృష్ట్యా అమెరికా జోక్యం చేసుకున్నదని వాటి సారాంశం. ఏదేమైనా ఓ ఇరవైయేండ్ల కిందటి భారత సైన్యం, ఈనాటి సైన్యం సామర్థ్యాలను పోల్చలేం. ఇప్పుడు అత్యంత శక్తిమంతమైన ఆయుధాలతో భారత త్రివిధ దళాలు దుర్భేద్యంగా మారిపోయాయి. దాన్ని ఆపరేషన్ సిందూర్ ద్వారా ప్రపంచదేశాలు కండ్లారా చూశాయి. విచిత్రంగా అమెరికా ఆయుధాలు వాడని ఈ యుద్ధం ట్రంప్ లాంటి వ్యాపారవేత్తకు కంటగింపుగా మారిందనేది కూడా సత్యమే.

> ఉగ్రవాదులు కర్మాగారాలు నెలకొల్పింది 'మన' భూభాగమైన ఆక్రమిత కశ్మీర్‌లో. అది పూర్తిగా మనలో విలీనమైతేనే మన లక్ష్యం సిద్ధించినట్టు. ఉగ్రవాద నాయకులు హాఫీజ్ సయీద్, మసూద్ అజర్, మాఫియా డాన్ దావూద్ ఇబ్రహీం తదితరులను అప్పగిస్తేనే పహల్గాం బాధితులకు ఊరట. ఈ రెండూ లేకుండా ఆపరేషన్ సిందూర్ అసంపూర్ణమే.

1972లో జర్మనీలోని మ్యూనిక్‌లో వేసవి ఒలింపిక్స్ సందర్భంగా 11 మంది ఇజ్రాయెల్ క్రీడాకారులను యూదులనే మత ప్రాతిపదికన పాలస్తీనా తీవ్రవాదులు దారుణంగా ఊచకోత కోశారు. దీనికి తీవ్రంగా స్పందించిన నాటి ఇజ్రాయెల్ ప్రధాని గోల్డా మెయిర్ ఆ దాడికి పాల్పడిన ఉగ్రవాదులను ప్రపంచంలో ఏ మూల దాక్కున్నా వదిలిపెట్టబోమని ప్రతిజ్ఞ చేశారు. ఆ బాధ్యత చేపట్టిన మొసాద్, విదేశాలకు పారిపోయి, వేష భాషలను, గుర్తింపును మార్చుకున్న ఆ తీవ్రవాదులను వెంటాడి, వేటాడుతూ, చివరి తీవ్రవాదిని 1979లో చంపేసింది. ఇజ్రాయెల్ స్వయంగా ప్రకటించేవరకు వాళ్లను ఎవరు చంపారో, ఎందుకు చంపారో ఎవరికీ తెలియదు. ఈ ఆపరేషన్‌కు పట్టిన సమయం దాదాపు ఏడేండ్లు. వాస్తవానికి ఇదే పద్ధతిని ఇప్పుడు భారత్ అవలంబించాల్సి ఉన్నది. భారత గడ్డపై ఇప్పటివరకు జరిగిన అన్నిరకాల ఉగ్రదాడులకు మూలకారకులైన వారిని ఎక్కడున్నా ఇదేరీతిన మట్టుపెడితేనే తీవ్రవాదాన్ని నిర్మూలించగలం. ప్రభుత్వాలు మారినా, కాలం మారినా.. స్థిరంగా ఆపరేషన్‌ను కొనసాగించడం, అందుకు కావాల్సిన స్వయం ప్రతిపత్తి 'రా'కు ఇవ్వడం జరగాలి.

భారతదేశం కూడా అంతర్జాతీయంగా, దౌత్యపరంగా ఒత్తిడి తెచ్చి, పాకిస్థాన్ ఉగ్రవాదులను అప్పగించే చర్యలను ఉధృతం చేస్తూనే ఉండాలి. పరిస్థితులు ఎటునుంచి ఎటుమారినా, ఆక్రమిత కశ్మీర్ మన పరం కానంతవరకు ఉగ్రవాదాన్ని అదుపు చేయడం అసాధ్యం. పాకిస్థాన్‌ను ముక్కలు చేస్తామన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎల్లకాలం ప్రజలను ఏమార్చలేదు. పీవోకేను తీసుకురాలేకపోతే అది బీజేపీకి ఆత్మహత్యా సదృశమే అవుతుంది. దానికి భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుంది.